రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి



పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్లు, మహిళా సిబ్బంది రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలి. పేషెంట్స్ కొంతమంది ఇబ్బంది కరంగా ప్రవర్తిస్తుంటారు. అలాగే ఇతర వ్యక్తుల నుంచి ఏవైనా ఇబ్బందికర పరిస్థితులు తలెత్తితే ఎదుర్కోవడానికి ప్రత్యేకంగా సెక్యూరిటీని నియమించాలి. – డాక్టర్ అనితశ్రీ, ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రం కడప.

పర్యవేక్షణ ఉండాలి...



ఆసుపత్రి పనివేళలు ముగిసినప్పుడు ఆసుపత్రి ప్రాంగణాల్లో కొంతమంది మద్యం సేవిస్తుంటారు. ఆసుపత్రి ప్రాంగణాల్లో అసాంఘిక చర్యలు చేపట్టకుండా ఉండాలి. అలాగే వైద్య సిబ్బందికి రక్షణ కల్పించేలా చర్యలు చేపట్టాలి. ఒక వాచ్‌మెన్‌ను నియమిస్తే బాగుంటుంది. – డాక్టర్ హైమ, ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రం, కడప



టోల్ ఫ్రీ నంబరు ఏర్పాటు చేయాలి



వైద్య విభాగంలో మహిళా విభాగానికి సంబందించి ఒక టోల్ ఫ్రీ నంబరును ఏర్పాటు చేయాలి. ఆపదలో ఉన్నప్పుడు ఆ నంబరుకు ఫోన్ చేస్తే, తక్షణం ప్రమాదంలో ఉన్నవారిని రక్షించేలా వ్యవస్థను ఏర్పాటు చేయాలి. వైద్య సిబ్బందిని రక్షించడానికి ప్రైవేటు సిబ్బంది కంటే పోలీస్ సెక్యూరిటీనే బాగుంటుంది. – డాక్టర్ సుమధుర, కడప

ప్రత్యేక చట్టాలు తేవాలి...



వైద్యులు..వైద్య సిబ్బందిపై దాడులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలి. అందుకోసం ప్రత్యేకంగా చట్టాలు తేవాలి. ఏదైనా సంఘటన జరిగినప్పుడు తక్షణం స్పందించే వ్యవస్థను ఏర్పాటు చేయాలి. వైద్యులు..వైద్య సిబ్బందిపై దాడులకు పాల్పడడం ఎంత మాత్రం తగదు. – డాక్టర్ వై. ప్రమోద, ఫెర్టిలిటి స్పెషలిస్ట్, లాప్రోస్కోపిక్ సర్జన్, కడప

క్లుప్తంగా

పారిశుధ్యాన్ని మెరుగుపరచాలి



అధికారులతో మాట్లాడుతున్న నగరపాలక అదనపు కమిషనర్ రాకేష్ చంద్రన్

కడప కార్పొరేషన్: కడప నగరంలో పారిశుధ్యాన్ని మెరుగు పరచాలని నగరపాలక అదనపు కమిషనర్ రాకేష్ చంద్రన్ అన్నారు. శుక్రవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా రవీంద్ర నగర్, కాగితాల పెంట, ఐటిఐ సర్కిల్, ఈట్ స్ట్రీట్ ప్రాంతాలను ఆయన పరిశీలించారు. కార్మికులు విధులను అశ్రద్ధ చేయవద్దని, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలన్నారు. ఇంటింటి చెత్త సేకరణ 100 శాతం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికుల హాజరుపట్టికలను తనిఖీ చేశారు. చెత్త పాయింట్లు ఎక్కడా లేకుండా శుభ్రం చేయాలని తెలిపారు. ఈట్ స్ట్రీట్‌ను శుభ్రంగా ఉంచాలని చెప్పారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ అధికారులు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న దంత వైద్యులు

కడప ఎడ్యుకేషన్: విద్యార్థులు చిన్నతనం నుంచే దంతాల పట్ల జాగ్రత్తలు తీసుకుని చాకెట్లు, స్వీట్లు వంటివి అతిగా తినకుండా దంతాలను రక్షించుకోవాలని డిపార్టుమెంట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డెంటిస్టు డాక్టర్ కిన్నరేష్ సూచించారు. శుక్రవారం కడప అంగడివీధిలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దంత పరీక్షలను నిర్వహించి ఉచితంగా పేస్టు, బ్రెషలను అందచేశారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటేశ్వరరెడ్డి, దంత వైద్యులు సుష్మ, తనజా, రాజు, దీనా, స్వప్న పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి



చిన్నచౌకులోని వంకపొరంబోకు స్థలాన్ని పరిశీలిస్తున్న అఖిలపక్ష నాయకులు

కడప కార్పొరేషన్: వంక పొరంబోకు స్థలాన్ని ఆక్రమించిన రియల్ ఎస్టేట్ వ్యాపారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం చిన్నచౌకులోని సర్వేనంబర్ 247/2 లోని స్థలాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో పేదలకు ఇచ్చిన స్థలాన్ని ఇలా రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించి యథేచ్ఛగా అపార్ట్‌మెంట్లు నిర్మించి అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడం దారుణమన్నారు. తక్షణం అధికారులు వంక పోరంబోకు స్థలాన్ని స్వాధీనం చేసుకొని పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు నారాయణరెడ్డి, కిషోర్ కుమార్, సత్తార్, సిఆర్వి ప్రసాద్, ఆంజనేయులు పాల్గొన్నారు.

మహా సభ లోగో ఆవిష్కరణ

కడప రూరల్: రెవల్యూషనరీ విద్యార్థి సంఘం (ఆర్‌ఎస్‌యు) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 13, 14, 15వ తేదీల్లో తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో నిర్వహించే ప్రథమ జాతీయ మహా సభ లోగోను శుక్రవారం వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి, శ్రీధర్, ప్రశాంత్, ఆఫిజున్ తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద శక్తులకు కొమ్ముకాస్తున్న బీజేపీ

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: దేశంలోని బీజేపీ ప్రభుత్వం మతోన్మాద శక్తులకు కొమ్ముకాస్తున్నదని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి కే మునెయ్య, ఇన్సాఫ్ జిల్లా నాయకుడు షేక్ గౌస్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ మోడీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం పాలనలో విఫలమైందన్నారు.

ఆంధ్రకేసరికి ఘన నివాళి

ఏఎఫ్‌యూ: కడప నగరంలోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో శుక్రవారం స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి 'ఆంధ్రకేసరి' టంగుటూరి ప్రకాశం పంతులు 153వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య జి. విశ్వనాథకుమార్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో ప్రజల కోసం తన యావదాస్తిని ఖర్చు చేసిన గొప్ప నాయకుడు ప్రకాశం పంతులు అన్నారు. నిరుపేద కుటుంబంలో పుట్టి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎదిగిన ఆదర్శనేత అన్నారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఎన్. రాజేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ దేశానికి, రాష్ట్రానికి టంగుటూరి ప్రకాశం పంతులు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నేషనల్ ఈవెంట్స్ కోఆర్డినేటర్ మనోహర్‌రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహనీయుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకుందాం

వైవీయూ: సుప్రసిద్ధ స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం మనకు స్ఫూర్తిదాయకమని యోగివేమన విశ్వవిద్యాలయం పీజీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆచార్య పుత్తా పద్మ అన్నారు. ఆంధ్రకేసరి జయంతిని విశ్వవిద్యాలయ పరిపాలన భవనంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్వవిద్యాలయ మాజీ రిజిస్ట్రార్ ఆచార్య డి. విజయ రాఘవ ప్రసాద్ మాట్లాడుతూ ఆంధ్ర కేసరి జీవిత చరిత్ర పుస్తకాలను లైబ్రరీలో అందుబాటులో ఉంచాలని కోరారు. వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎస్. ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో పుట్టి, కష్టపడి చదువుకుని, ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి అయ్యారని, కష్టపడే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని చెప్పడానికి ఈయన జీవితమే నిదర్శనమన్నారు. సహ ఆచార్యులు డాక్టర్ కె. లలితతో పాటు పలువురు విద్యార్థులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సహాయ ఆచార్యులు డా. గంగయ్య, డా. కోట మృత్యుంజయరావు, ఆచార్య ఎల్. మాధవి, ఆచార్య డి. విజయలక్ష్మి, బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



ఏఎఫ్‌యూ: టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వీసీ ఆచార్య జి. విశ్వనాథకుమార్, రిజిస్ట్రార్, అధ్యాపకులు

ఘనంగా టంగుటూరి జయంతి

కడప కల్చరల్ : ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులుకు నగర వాసులు ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం ఏడురోడ్ల కూడలిలోని ఆయన విగ్రహానికి పూలమాలలు అలంకరించి నివాళులర్పించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య పూర్వ అధ్యక్షులు పోతుల వెంకట్రామిరెడ్డి, ధార్మికవేత్త సట్టి భారవి, జిల్లా అర్చక పురోహిత సమాఖ్య అధ్యక్షులు విజయభట్టర్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణశర్మ, కొండారెడ్డి, రాఘవేంద్రవర్మ తదితరులు ఆంధ్రకేసరి త్యాగాలు, ధైర్యసాహసాలు గుర్తు చేసుకున్నారు. స్థానిక ప్రముఖులు సగళ నాగేశ్వర రావు, గంజికుంట గణేష్, బాలకృష్ణ తదితరులు మాట్లాడుతూ ప్రకాశం పంతులు ఆలోచనలు భావతరాలకు మార్గదర్శనమన్నారు. ఏడురోడ్ల కూడలికి ప్రకాశం పంతులు సర్కిల్‌గా నామకరణం చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు.

శంకరాపురంలో ..

స్థానిక వైద్యులు గోపినాథ్ ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల అలంకరించి నివాళులర్పించారు.

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు చిరస్మరణీయులు అని కేంద్ర కారాగార పర్యవేక్షణ అధికారి ఐఎన్‌హెచ్ ప్రకాశ్ తెలిపారు. శుక్రవారం కేంద్ర కారాగారంలో ఆంధ్ర కేసరి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప పర్యవేక్షణ అధికారులు జవహర్‌బాబు, రమేష్, జైలర్లు, డిప్యూటీ జైలర్లు, మినిస్ట్రీరియల్ సిబ్బంది, వైద్య సిబ్బంది, గార్డింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



కడప కోటిరెడ్డి సర్కిల్: టంగుటూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేంద్ర కారాగార అధికారి ప్రకాశ్



వైవీయూ: టంగుటూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు



కడప కల్చరల్: టంగుటూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న పోతుల వెంకట్రామిరెడ్డి తదితరులు

ఎంటీఎస్ అమలు చేయాలి

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయంలోని అకడమిక్ కన్సల్టెంట్స్, గెస్ట్ ఫ్యాకల్టీ బృందం శుక్రవారం కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డిని కలిసి సమస్యలు విన్నవించారు. పీజీ, సెట్, నెట్, పీహెచ్డీ అర్హత కలిగి అతి తక్కువ వేతనాలతో విద్యాలయంలో పనిచేస్తున్న తమకు మినిమం టైం స్కేల్ (ఎంటీఎస్) అమలు చేసేలా చూడాలని కోరారు. పీజీ అర్హత ఉండి దశాబ్దకాలంగా పనిచేస్తున్న కొంతమంది అకడమిక్ కన్సల్టెంట్లను గెస్ట్ ఫ్యాకల్టీగా మార్పు చేస్తూ రూ. 35 వేల జీతం నుంచి రూ. 25 వేలకు తగ్గించారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని జూనియర్, డిగ్రీ కళాశాలలలో ఒప్పంద అధ్యాపకులకు రూ. 62,000 శాలరీ ఇస్తున్నారని, విద్యాలయాల్లో పనిచేసే తమకు రూ.35,000 మాత్రమే ఇస్తున్నారని వివరించారు. వినతిని స్వీకరించిన ఎమ్మెల్యే స్పందిస్తూ మీ సమస్యను రాష్ట్ర విద్యా మంత్రి లోకేష్ దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కడప కోటిరెడ్డి సర్కిల్ : సీజనల్ వ్యాధులతోపాటు దోమకాటు వల్ల వచ్చే జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్న లత సూచించారు. కడపలోని నాగరాజుపేట అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని నాగరాజుపేట–1 సచివాలయ పరిధిలోని బోరెడ్డి వీధిలో హెల్త్ ఎడ్యుకేటర్ బృందం సందర్శించి ఇంటింటి ఫీవర్ సర్వేను పరిశీలించి ఫ్రైడే డ్రై – డే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ కార్యమంలో ట్రైనీ డాక్టర్లు శిరీష్ కుమార్, మౌనిక , హోమియో డాక్టర్లు సోనియా, ఖలందర్‌బాషా, రీహానా, సారిక, ప్రమోద్రాయ్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్

కడప ఎడ్యుకేషన్: కళాశాలల్లో ర్యాగింగ్ అనేది చట్టరీత్యానేరం అని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ కమ్ సీనియర్ సివిల్‌జడ్జి బాబా ఫక్రుద్దీన్ పేర్కొన్నారు. శుక్రవారం కడపలోని యస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో ర్యాగింగ్ చట్టరీత్యా నేరం అనే అంశంపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులను మానసిక లేదా శారీరక హింసకు గురిచేయడమనేది నేరం అన్నారు. అలాగే లైగింక వేధింపులు, స్వలింగ సంపర్క దాడులు, బట్టలు విప్పడం వంటి చర్యలను కూడా చేపట్టకూడదన్నారు. ఇలా చేస్తే నేరం అవుతుందన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడినా లేదా ప్రోత్సహించినా కూడా జైలు శిక్షపడుతుందన్నారు. ఏవైనా సమస్యలుంటే న్యాయసేవ అధికార సంస్థ దృష్టికి తీసుకరావచ్చన్నారు. ఈ కార్యక్రమంలో యస్వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంతరిక్ష రంగంలో భారత్ సరికొత్త చరిత్ర

– వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూ వీసీ ఆచార్య జి. విశ్వనాథకుమార్

ఏఎఫ్‌యూ: చంద్రయాన్–3 విజయంతో భారత దేశం అంతరిక్ష రంగంలో సరికొత్త చరిత్ర సృష్టించిందని డాక్టర్ వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య జి. విశ్వనాథకుమార్ పేర్కొన్నారు. శుక్రవారం డా. వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూలో జాతీయ అంతరిక్ష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన చంద్రయాన్–3 నమూనాను వీసీ ఆవిష్కరించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ చంద్రుని సౌత్‌పోల్‌పై కాలు పెట్టిన తొలి దేశంగా భారత్ నిలిచిందన్నారు. ఎన్నో అభివృద్ధి చెందిన దేశాలకు సాధ్యం కాని ఘనతను భారత్ సాధించిన శుభసందర్భంలో ఈ రికార్డుకు గుర్తుగా ప్రతియేటా ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కెనరా బ్యాంకు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కె. మురళీమోహన్ మాట్లాడుతూ అంతరిక్ష పరిశోధనల్లో ప్రపంచదేశాలతో పోటీపడుతూ మనదేశం అభివృద్ధి సాధిస్తోందన్నారు. అనంతరం చంద్రయాన్–3 గురించి విశ్వవిద్యాలయం భౌతికశాస్త్ర అధ్యాపకుడు డా. జి. ఫణీంద్రా రెడ్డి వివరించారు. అనంతరం 'నషా ముక్త్ భారత్ అభియాన్'లో భాగంగా మాదక ద్రవ్యాల నియంత్రణకు కృషిచేస్తామంటూ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కాంపిటీషన్స్ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఎస్. రాజేష్‌కుమార్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చంద్రయాన్ నమూనా వద్ద వీసీ, అధ్యాపకులు

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో అవుట్ సోర్సింగ్ కింద పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ పీటీడీ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కోరారు. అన్నమయ్య జిల్లాకు వచ్చిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానంగా ఏపీఎస్ ఆర్టీసీలో రెండు దశాబ్దాల నుండి 7800 మంది అవుట్ సోర్సింగ్ కార్మికులు పనిచేస్తున్నారన్నారు. అయితే ఏపీఎస్ ఆర్టీసీ మేనేజ్‌మెంటు నిర్ణయించిన కనీస వేతనాలు ఎక్కడా అమలు కావడం లేదన్నారు. సమయానికి జీతాలు ఇవ్వకపోవడం వంటి సమస్యల వలన కార్మికులు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.

ఆర్టీసీలో పనిచేసే కార్మికు లందరినీ థర్డ్ పార్టీ విధానం రద్దు చేసి ఆప్కాస్ కార్పొరేషన్లోకి చేర్చాలని లేదా ఆర్టీసీ సంస్థ నుండి నేరుగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల బ్యాంకు అకౌంట్ కి జీతాలు వచ్చే విధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి త్వరలో మీ సమస్యలను పరిష్కరించి తగున్యాయం చేస్తామని హామీ ఇచ్చారని నాయ కులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్‌ఆర్టీసీ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ గజపతి , రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ గంగాజనేయులు , కడప జిల్లా అధ్యక్షులు విజయ్, అన్నమయ్య జిల్లా వైస్ ప్రెసిడెంట్ సోమశేఖర్ రెడ్డి, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌పై దాడి కేసులో నిందితుడికి జైలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : పులివెందుల పట్టణంలోని దర్గా వీధిలో 2022 ఫిబ్రవరి 9వ తేదీన ఇంటి ఆస్తి విషయమై దర్గావీధిలో గొడవపడుతున్నట్లు డయల్ 100కు కాల్ వచ్చింది. దీంతో స్పందించిన బ్లుకోల్ట్ కానిస్టేబుల్ సునీల్‌కుమార్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని గొడవ విషయాన్ని విచారిస్తుండగా కుల్లాయప్ప అనే వ్యక్తి కానిస్టేబుల్‌పై బండరాయితో దాడి చేశారు. అప్పట్లో కానిస్టేబుల్ సునీల్‌కుమార్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పుడు ఎస్సైగా ఉన్న గోపీనాథ్‌రెడ్డి కేసు నమోదు చేశారు. ఈ కేసు కడప జిల్లా కోర్టులోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టుకు శుక్రవారం విచారణకు వచ్చింది. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపించారు. కేసు విచారణ అనంతరం ముద్దాయి కుల్లాయప్పకు 4 ఏళ్లు జైలు శిక్షతోపాటు రూ.4 వేలు జరిమానా విధిస్తూ అడిషనల్ సివిల్ జడ్జి ప్రత్యూష కుమారి తీర్పును ఇచ్చారు. ఈ కేసులో ముద్దాయికి శిక్ష పడేందుకు ప్రధానపాత్ర పోషించిన ఏపీపీ శేషయ్య, దర్యాప్తు అధికారి గోపీనాథరెడ్డి, కోర్టు కానిస్టేబుల్ నరసింహులు, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, డీఎస్పీ మురళీ నాయక్‌లను అభినందించారు.

వైవీయూ ఇన్‌చార్జి వీసీని తొలగించాలి



వేమన విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు, విద్యార్థులు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డిని వీసీ పదవి నుంచి తప్పించాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ మేరకు వైవీయూ ముట్టడి నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు విశ్వవిద్యాలయంలోకి చొచ్చుకు వెళ్లేందుకు యత్నించగా సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో ప్రధాన ద్వారం వద్ద వేమన విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వి. గంగాసురేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి. వలరాజు మాట్లాడుతూ అనైతిక కార్యకలాపాలకు పాల్పడిన ఆచార్య కె. కృష్ణారెడ్డి వారంరోజుల్లో రాజీనామా చేసి పదవి నుంచి వైదొలగాలని డిమాండ్ చేశారు. ఆయనపై వచ్చిన ఆరోపణలు అన్నింటికీ ఆధారాలు ఉన్నాయని, త్వరలో మరో కరపత్రం విడుదల చేస్తామని ప్రకటించారు. జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు వీసీకి అండగా నిలుస్తున్నారంటూ ప్రచారం చేసుకుంటున్నారని, ఆరోపణలు ఉన్న ఇలాంటి వ్యక్తికి మద్దతు ఇవ్వడం సరికాదని, ఈయన గురించి వాస్తవాలు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె. శివశంకర్, ఉపాధ్యక్షుడు నాగార్జున, నాయకులు అరుణ్‌కుమార్, తేజ, అకీరానందన్, చంద్ర, అశోక్, రాజేష్, నరసింహ, మస్తాన్, గణేష్, షరీఫ్, ఫహీద్, సాయి తదితరులు పాల్గొన్నారు.

వర్క్‌షాప్‌ను వినియోగించుకోవాలి



వర్క్‌షాప్‌లో పాల్గొన్న అతిథులతో దంత వైద్య విద్యార్థులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : దంత వైద్యులకు డిజిటల్ స్మైల్ డిజైనింగ్ పరిజ్ఞానాన్ని పెంపొందించడంలో వర్క్‌షాపు ఎంతో దోహదపడుతుందని డాక్టర్ జంగల హరి, డాక్టర్ రెడ్డిచైతన్యలు తెలిపారు. శుక్రవారం కడప నగరంలోని ప్రభుత్వ దంత వైద్య కళాశాలలో ప్రాస్టోడాంటిక్స్ విభాగంలో ప్రత్యేక డిజిటల్ స్మైల్ డిజైనింగ్ వర్క్‌షాపును డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాంకేతికత ప్రాథమిక అంశాలు, ప్రయోజనాలు, కొత్త ఆవిష్కరణ గురించి వివరించారు. ఈ వర్క్‌షాప్‌ను ప్రతి దంత వైద్య విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. రాయలసీమలోని జిల్లాల తోపాటు నెల్లూరు జిల్లా నుంచి 60 మంది పీజీ దంత వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. వర్క్‌షాప్‌లో దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోత్స్న, ప్రాస్టోడాంటిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ డి.సుధామాధురి, అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ మహాలక్ష్మి, డాక్టర్ శేషారెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ఆంజనేయులు, డాక్టర్ మధుసూదన్, డాక్టర్ శ్రీవిద్య, డాక్టర్ బాలాజీ, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యం డీపీఎంగా ప్రవీణ్‌కుమార్ నియామకం

కడప అగ్రికల్చర్: ప్రకృతిసేద్యం కడప జిల్లా ప్రాజెక్టు మేనేజరుగా కాశినాయన మండల వ్యవసాయ అధికారిగా పనిచేస్తున్న ప్రవీణ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన నేడు డీపీఎంగా కడపలోని ప్రకృతిసేద్యం జిల్లా కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించనున్నారు. ప్రవీణ్‌కుమార్ కడప డీపీఎంతోపాటు అన్నమయ్య జిల్లా ఎఫ్‌పీసీ డీపీఎంగా కూడా పనిచేయనున్నారు. ప్రస్తుతం కడప ప్రకృతిసేద్యం డీపీఎంగా పనిచేస్తున్న రామకృష్ణంరాజు అన్నమయ్య జిల్లా రైతు శిక్షణా కేంద్ర వ్యవసాయ అధికారిగా బదిలీపై వెళ్లారు.

ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులను సీజ్ చేయాలి



ఉప రవాణా అధికారి మీరా ప్రసాద్‌కు వినతి పత్రాన్ని సమర్పిస్తున్న ఏఐఎస్‌యూ నాయకులు

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో ఫిట్‌నెస్ లేకుండా తిరుగుతున్న స్కూలు, కళాశాల బస్సులను వెంటనే సీజ్ చేయాలని ఆల్ ఇండియా స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జగదీష్, రాష్ట్ర కార్యదర్శి నాగరాజులు డిమాండ్ చేశారు. ఈ విషయమై శుక్రవారం కడప జిల్లా ఉప రవాణా కమిషనర్ మీరా ప్రసాద్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో చాలా కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్ల, ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన బస్సుల్లో చాలావాటికి ఫిట్‌నెస్ లేకున్నా అలాగే ఎఫ్ సి , ఇన్సూరెన్స్ లేకపోయినా విద్యార్థులను తరలిస్తున్నారన్నారు. తర్ఫీదు లేని డ్రైవర్లతో విద్యార్థులను తరలించడం వల్ల బస్సులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. బస్సుల్లో సామర్థ్యానికి మించి విద్యార్థులను నింపి నడుపుతున్నారని ఆరోపించారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లక్షలాది రూపాయలు ఫీజులు దండుకుంటున్నారని మండిపడ్డారు.



మొక్క నాటుదాం

అమ్మ పేరుతో ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని మను పాలిటెక్నిక్ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ మిర్జా విలయత్ అలీ బైగ్ అన్నారు. రిమ్స్ సమీపంలోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు నిర్వహిస్తున్న స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. – కడప ఎడ్యుకేషన్



కమ్ముకున్న మేఘం

ఉదయం నుంచి ఉక్కపోతతో అల్లాడిపోయిన జనానికి సాయంత్రానికి కాసంత చల్లదనం దక్కింది. శుక్రవారం కడప నగరంలో ఉదయం నుంచి ఉబ్బరపు ఎండ జనాలను అల్లాడించింది. అయితే సాయంత్రం 6 గంటలకంతా ఆకాశమంతా ఒక్కసారిగా దట్టమైన మేఘాలతో కమ్ముకుంది. 6.30 గంటల ప్రాంతంలో నగరంలో కొద్దిసేపు వర్షం కురిసింది. ఉక్కపోత నుంచి నగరవాసులకు కాసింత ఉపశమనం కలిగింది. – కడప అగ్రికల్చర్